సాక్షి శ్రీకాకుళం

గురువారం ∙ 13 ∙ మార్చి ∙ 2025




మీ కిడ్నీలు ఎంత భద్రం?

కిడ్నీ మహమ్మారి జిల్లావాసులను వణికిస్తోంది. ఈ నేపథ్యంలో ముందుగానే కిడ్నీలను పరీక్షించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. - 8లో



ఏనుగుల హల్‌చల్

కొత్తూరు: ఆంధ్రా ఒడిశా సరిహద్దులోని హంస, కడుము గ్రామాల సమీపంలో నాలుగు ఏనుగులు హల్‌చల్ సృష్టించాయి. మొక్కజొన్న, చెరకు పంటలను ధ్వంసం చేశాయి. సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐ అమీర్ ఆలీ పరిస్థితిని సమీక్షించారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహోర్
గురు (సా)	శుక్ర (ఉ)
6.08	4.49

న్యూస్‌రీల్

డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్ష ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిసెంబర్‌లో జరిగిన స్పెషల్ డ్రైవ్ డిగ్రీ–1, 2, 3 సెమిస్టర్ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జ్ఞానభూమి వెబ్‌సైట్, వర్సిటీ వెబ్‌సైట్‌లలో ఫలితాలు అందుబాటులో ఉంచామని యూజీ ఎగ్జామినేషన్స్ ఇన్‌చార్జి డీన్ పి.పద్మారావు తెలిపారు. రీవాల్యుయేషన్‌కు 15 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్

- బీసీ సంక్షేమశాఖలో ఇద్దరు చిరుద్యోగుల నుంచి లంచం డిమాండ్
- రూ.25 వేలు తీసుకుంటూ పట్టుబడిన వైనం



బాలరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిరుద్యోగుల నుంచి లంచం తీసుకుంటూ బీసీ సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్ బుడుమూరు బాలరాజు ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ బి.వి.ఎస్.ఎస్.రమణమూర్తి, సీఐ కె.భాస్కరరావులు విలేకరులకు వివరాలు వెల్లడించారు. బీసీ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కుక్, అటెండర్లకు ఇంక్రిమెంట్లు, ఇతర ఎరియర్స్ బిల్లులు పెట్టేందుకు సీనియర్ అసిస్టెంట్ బాలరాజు డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. వారు ఇచ్చిన సూచనల మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో బాధితుల నుంచి రూ.10,000, రూ.15,000 చొప్పున మొత్తం రూ.25,000బాలరాజు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

గాడితప్పిన 'సంక్షేమం'

కాగా, బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగులు ఏసీబీ దాడుల్లో పట్టుపడటం ఇది మూడోసారి. డీబీసీగా రవిచంద్ర ఉన్న సమయంలో ఉపకార వేతనాల కుంభకోణంలో అప్పటి అధికారులు, సిబ్బంది ఏసీబీకి చిక్కారు. ఆరుగురు సస్పెండయ్యారు. ఆ కేసు ఇంకా కొనసాగుతోంది. మూడేళ్ల క్రితం బీబీసీగా శ్రీదేవి ఉన్న సమయంలో విద్యార్థుల యూనిఫారాల కుట్టు మజూరీలు చెల్లించేందుకు లంచం అడిగిన జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తాజాగా బాలరాజు సైతం ఏసీబీకి చిక్కారు. అయితే ఈ ఘటనలన్నింటిలోనూ చిన్నస్థాయి ఉద్యోగులకే కాకుండా ఉన్నతాధికారుల భాగస్వామ్యం కూడా ఉండే అవకాశం ఉందంటూ పలువురు చర్చించుకోవడం గమనార్హం. నెల రోజులు క్రితం ఈ శాఖ అధికారులు, వార్డెన్లను ఏసీబీ అధికారులు కార్యాలయానికి పిలిపించారు. అవినీతి కార్యక్రమాలపై ఆరాతీశారు. వీటిలో ప్రధానంగా బీఆర్ (బొడ్డేపల్లి రాజగోపాలరావు) శత జయంతి ఉత్సవాలకు రూ.25 లక్షలు ఖర్చు చేసినట్టు చూపించారని, అందులో భారీగా అవినీతి జరిగిందని, బదిలీలు, పదోన్నతులు, తదితర అంశాలపై ఆరాలు తీసినట్లు తెలిసింది. అయినా ఈ శాఖలోని కొందరు అవినీతి ఉద్యోగుల్లో మార్పు రాలేదు.

పక్కాగా 'పది' పరీక్షలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, డీఈవో తిరుమల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



యువ గర్జన

యువత పోరుకు విశేష స్పందన

- కలెక్టరేట్ వద్ద కదం తొక్కిన విద్యార్థులు, నిరుద్యోగులు
- వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- సర్కారు ఉక్కుపాదం మోపినా వెనక్కి తగ్గని పరిస్థితి
- 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాల హోరు
- బాబు మోసం గ్యారెంటీ: పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్
- బాబు ధ్యాసంతా అమరావతిపైనే: మాజీ మంత్రి సీదిరి
- నిరుద్యోగులను నట్టేట ముంచారు: మాజీ స్పీకర్ తమ్మినేని



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, సీదిరి అప్పలరాజు, పిరియా విజయ, నర్తు రామారావు, రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, పేరాడ తిలక్, చింతాడ రవికుమార్ తదితరులు



యువతరం ఉత్తుంగ తరంగమై కదం తొక్కింది. కూటమి సర్కారు మోసపూరిత వైఖరిని గొంతెత్తి గర్జించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి వంటి హామీలను విస్మరించిన చంద్రబాబు సర్కారు తీరుపై నిరసనలతో హోరెత్తించింది. వైఎస్సార్‌సీపీ పిలుపునకు యువత నుంచి లభించిన అనూహ్య స్పందన తొమ్మిది నెలల స్వల్ప కాలంలోనే కూటమి ప్రభుత్వంపై యువతలో పెరిగిన అసంతృప్తికి యువత పోరు ఉద్యమం దర్పణం పట్టింది.

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం పాతబస్టాండ్:

కూటమి ప్రభుత్వ మోసాలపై యువత గర్జించింది. తమకు మద్దతుగా పోరు సాగిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన గళం వినిపించింది. ప్రధానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తున్న పాలకుల తీరును తీవ్రంగా ఎండగట్టింది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువత పోరు' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ నేతృత్వంలో తొలుత బకాయి ఫీజులు వెంటనే చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహాత్మా జ్యోతిరావుపూలే పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ.. బకాయి పడ్డ వేతనాలు వెంటనే చెల్లించాలి.. నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వాలి అని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయసాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ రెండు పథకాలకు సరిపడా నిధులను బడ్జెట్ కేటాయింపులు పెంచి సకాలంలో వాటిని విడుదల చేయాలన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి మోసాలపై భవిష్యత్‌లో ఉద్యమాలు మరింత ఉద్ధృతం చేస్తామన్నారు.

కార్యక్రమంలో యువజన విభాగం ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, తూర్పు కాపు, కళింగ వైశ్య కులాల రాష్ట్ర అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి సత్యనారాయణ, డాక్టర్స్ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు చింతాడ వరుణ్, ఇంటెలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల రామకృష్ణారావు, కార్యదర్శి సీపాన వెంకటరావు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, ధర్మాన కృష్ణచైతన్య, తమ్మినేని చిరంజీవినాగ్, మార్పు పృథ్వీ, ముంజేటి కృష్ణమూర్తి, ఎంఏ బేగ్, లోలుగు కాంతారావు, గొండు కృష్ణ, చిట్టి జనార్దన, సాదు వైకుంఠరావు, గొండు రఘు, శాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ప్రత్తి అన్వేష్, బల్లాడ జనార్దన్ రెడ్డి, పిన్నింటి సాయి, రౌతు శంకరరావు, ఎన్ని ధనుంజయరావు, సీపాన రామారావు, రుప్ప దివ్య, వై.వి.శ్రీధర్, బొడ్డేపల్లి పద్మజ, బొడ్డేపల్లి రమేష్, గుండ హరీష్, టి.కామేశ్వరి, యజ్జల గురుమూర్తి, ఖండాపు గోవిందరావు, కోట గోవిందరావు, పప్పల రమేష్, పీస శ్రీహరి, పీస గోపి, అంబటి శ్రీనివాసరావు, మూకళ్ల తాతబాబు, బొడ్డేపల్లి రమణ, పప్పల పారినాయుడు, సనపల బాబూరావు, తమ్మినేని మురళి, బెండి గోవిందరావు, తమ్మినేని శ్రీరామ్మూర్తి, బాడాన సునీల్, వాడన కృష్ణ, దుంపల గోవిందరావు, సీహెచ్ భాస్కరరావు, విద్యార్థులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.



చింతాడ రవికుమార్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

- ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌ను నందగిరిపేట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమానికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో ఆయన వాహనాన్ని అక్కడే వదిలేసి బైక్‌పై వచ్చేశారు.
- ఆమదావలస నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్‌కు చేరుకున్నారు.
- పలాస నుంచి శ్రీకాకుళం బయలుదేరిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పోలీసులు హౌస్ అరెస్ట్ చేయాలని ప్రయత్నించారు. ఆయన చాకచక్యంగా తప్పించుకుని జిల్లా కేంద్రంలో జరుగుతున్న యువతపోరు కార్యక్రమానికి వచ్చేశారు.

ప్రభుత్వ తీరు దుర్మార్గం



ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేయడానికి వైఎస్సార్ సీపీ హయాంలో 17 కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటయ్యాయి. కూటమి సర్కారు మాత్రం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోంది. మెడికల్ సీట్లు కూడా వద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడం దురదృష్టకరం. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడం తగదు. ప్రభుత్వం వెంటనే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి.

– తమ్మినేని సీతారాం, మాజీ శాసన సభాపతి

అప్పులు తెచ్చి ఫీజులు కడుతున్నారు



కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలిచ్చింది. నిరుపేద విద్యార్థులను, నిరుద్యోగ యువతకు అమలుచేయలేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు వాటిని అమలు చేయలేక సీఎం చంద్రబాబునాయుడు ముఖం చాటేస్తున్నారు. రాష్ట్రంలో సుమారు 11 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పరీక్షలు రాసేందుకు యాజమాన్యాలు హాల్‌టిక్కెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు తెలిసింది. దీంతో తల్లిదండ్రులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. నిరుద్యోగులంటే కూటమి ప్రభుత్వానికి ఎందుకంత చిన్నచూపు?

–ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

అరకొరగా కేటాయింపులు



గత ఏడాది ఎన్నికల కోడ్ సమయంలో విద్యార్థులకు ఫీజు డబ్బులు ఇవ్వనీయకుండా కూటమి పార్టీలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. అధికారంలోకి వచ్చాక ఫీజులు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలకు ఏటా రూ.3,900 కోట్లు కావాలి. ఇప్పటికే ఉన్న బకాయిలు రూ.3,200 కోట్లు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సింది మరో రూ.3,900 కోట్లు. మొత్తం కావాల్సింది రూ.7,100కోట్లు. ఈ బడ్జెట్‌లో కేటాయించింది మాత్రం రూ 2,600 కోట్లే. నిరుద్యోగ భృతి పేరిట కూడా యువతను మోసగించారు. బాబు ధ్యాసంతా అమరావతిపైన తప్ప మెడికల్ కాలేజీలపై లేదు.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

పేదల పక్షపాతి వైఎస్సార్ సీపీ



శ్రీకాకుళంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణుల సమక్షంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించిన నాయకుడు వైఎస్ జగన్
- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాంతరం రాష్ట్రంలో పేదల కన్నీళ్లు, నిరుపేదల కష్టాలు తీర్చాలన్న దృఢ సంకల్పంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2011లో వైఎస్సార్ సీపీని ప్రారంభించారని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా భావించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే సీఎం చంద్రబాబు చేస్తున్న అరాచక పాలనను ప్రజలు తట్టుకోలేకపోతున్నారని చెప్పారు. చంద్రబాబుని ఎప్పుడు గద్దె దింపుదామా అని ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

గృహ నిర్మాణాలకు అదనపు సాయం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను నిర్మించుకునేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అదనపు సాయం అందిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2029 నాటికి 'అందరికీ గృహ నిర్మాణం' అనే లక్ష్యాన్ని సాధించేందుకు ఈ సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఇప్పటికే ఇల్లు మంజూరై నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తి చేసేందుకు సాయం అందిస్తామన్నారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు యూనిట్ ధర కంటే అదనంగా రూ.50,000, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75,000, పీవీటీజీ (పర్టిక్యులర్లీ వనరబుల్ ట్రైబల్ గ్రూప్) లబ్ధిదారులకు రూ.1,00,000 చెల్లించనున్నట్లు వివరించారు. 2024 డిసెంబర్ 10 నాటికి నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ నగేష్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, హౌసింగ్ పీడీ నగేష్

క్లుప్తంగా

బాధ్యతగా విధులు నిర్వహించండి

- జెడ్పీ ఛైర్‌పర్సన్ విజయ



ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

అరసవల్లి: జిల్లా పరిషత్ యాజమాన్యంలో కారుణ్య నియామకాలను పూర్తి పారదర్శకంగా చేపడుతున్నామని, ఉద్యోగాలు పొందినవారు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ సూచించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బంగ్లాలో కారుణ్య నియామకాల కింద పాలక దమయంతి (సరుబుజ్జిలి ఎంపీపీ ఆఫీస్ సబార్డినేట్), మక్క అప్పలనాయుడు (జెడ్పీ ఆఫీస్ సబార్డినేట్), లండ కోటేశ్వరరావు (కొలిగాం జెడ్పీ స్కూల్ ఆఫీస్ సబార్డినేట్) లకు నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎల్ఎస్‌వీ శ్రీధర్ రాజా, సీ సెక్షన్ సూపరింటెండెంట్ రమేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఘటనా స్థలంలో మధు మృతదేహం

పాతపట్నం: మండలంలోని ద్వారాకాపురం వద్ద పాతపట్నం–టెక్కలి రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని లాబర గ్రామానికి చెందిన సనపల మధు(22) బుధవారం సాయంత్రం సారవకోట మండలం కరడసింగి గ్రామంలోని తన చెల్లెలు ఇంటికి వెళ్లాడు. అనంతరం తన బావ మండల శివ, మేనల్లుడు (రెండు సంవత్సరాల)తో కలిసి ద్విచక్ర వాహనంపై లాబర బయల్దేరారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై సారవకోట మండలం జమచక్రంకు చెందిన పంతులు గోపి వస్తున్నాడు. ద్వారకాపురం వద్ద ఈ రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఘటనలో సనపల మధు అక్కడికక్కడే మృతి చెందగా, పంతులు గోపి, మండల శివకు తీవ్రగాయాలయ్యాయి. రెండేళ్ల బాబుకి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి ఎస్ఐ బి.లావణ్య చేరుకున్నారు. గోపిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్‌లో, మండల శివ, బాలుడిని పాతపట్నం సీహెచ్‌సీకి ఎస్ఐ జీపులో తరలించారు. మృతుడు మధుకి తండ్రి సనపల కృష్ణారావు, తల్లి సనపల సావిత్రిలు ఉన్నారు. వచ్చే నెల ఏప్రిల్ 16న పెళ్లి చేయాలని ముహూర్తం పెట్టుకున్నామని విలపిస్తున్నారు.

మీ కిడ్నీలు భద్రమేనా?



మా నాన్నకు డయాలసిస్ చేయండి

కవిటి మండలం సహలాలపుట్టుగ గ్రామానికి చెందిన పొట్టి దుర్యోధన ఐదు నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. గతంలో టీబీ క్యాన్సర్‌తో పోరాటం చేసి కోలుకుంటున్న దశలో కిడ్నీ మహమ్మారి సోకడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇతనికి భార్య జమున, ఐదు, ఏడు తరగతులు చదువుతున్న కుమార్తెలు మోక్ష, సమీరా ఉన్నారు. సొంతిల్లు లేకపోవడంతో స్పెసెల్ గాయ్స్ ఫౌండేషన్ సభ్యులు నిర్మించిన చిన్న పాటి గుడిసెలో తలదాచుకుంటున్నారు. తొలుత శ్రీకాకుళంలోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. వేలాది రూపాయలు ఖర్చు చేశారు. సోంపేట, కవిటి డయాలసిస్ కేంద్రాలకు వెళ్లి ఉచితంగా డయాలసిస్ చేయించాలని వేడుకోగా.. ఎవరైనా చనిపోతే ఆ స్థానంలో డయాలసిస్ అవకాశం ఉందంటూ సిబ్బంది చెప్పేశారు. శుక్రవారం మరో మారు కవిటి వెళ్లి సిబ్బంది కాళ్లావేళ్లా పడితే చేతికి 'ఫిస్టల్' అమర్చారని, త్వరలో పిలుస్తామంటూ చెప్పి నేటికి వారం దినాలు అవుతున్నా కబురు పంపలేదని భార్య ఆవేదన వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వం స్పందించి ఉచితంగా డయాలసిస్ చేయించి తండ్రి ప్రాణాలు కాపాడాలని కుమార్తెలు వేడుకుంటున్నారు.



- ఆ మూడు పరీక్షలు తప్పనిసరి
- జిల్లాను పట్టిపీడిస్తున్న కిడ్నీ మహమ్మారి
- బాధితులకు భరోసా ఇవ్వని కూటమి ప్రభుత్వం
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లాలో డయాలసిస్ కిడ్నీ రోగుల దుస్థితి దయనీయంగా మారింది. ఉద్దానంలో ఈ ఒక్కరిదే కాదు వందలాది మంది డయాలసిస్ రోగుల పరిస్థితి ఇలాగే ఉంది. కవిటి, సోంపేట సీహెచ్‌సీ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అవసరాలకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయకపోవడంతో డయాలసిస్ చేయడం అసాధ్యంగా మారింది. అప్పటికే డయాలసిస్ చేసుకుంటున్న వారు చనిపోతే తప్ప కొత్త వారికి డయాలసిస్ చేసే పరిస్థితి జిల్లాలో లేదు. జిల్లాలో 25వేలకు పైగా కిడ్నీ రోగులు ఉన్నారు. కిడ్నీ రోగులతో పాటు డయాలసిస్ కు చేరుకుంటున్న వారి కూడా సంఖ్య పెరుగుతోంది. ఇప్పుడున్న డయాలసిస్ యూనిట్లు సరిపోవడం లేదు. మరోవైపు మృత్యువాత పడుతున్న రోగుల సంఖ్య పెరుగుతోంది. 2024–25లో సుమారు 100మంది కిడ్నీ రోగులు మరణించినట్టుగా తెలుస్తోంది. డయాలసిస్ సెంటర్లతో పాటు అన్ని పీహెచ్‌సీల్లో గత ప్రభుత్వం 12 రకాల మందులను ఉచితంగా సరఫరా చేసేది. ఇప్పుడా పరిస్థితి లేదు. నెఫ్రాలజిస్టులు అందుబాటులో ఉండటం లేదు. దీంతో విశాఖపట్నం, శ్రీకాకుళం వెళ్లి తనిఖీలు చేసుకోవల్సిన పరిస్థితి. వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు అవుతుండటం, ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఫించన్లు ఇవ్వకపోవడంతో కుటుంబాలు చిదికిపోతున్నాయి. ఒక్క ఉద్దానం ఏరియాలోనే జిల్లాలో కూడా కిడ్నీ కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ప్రభుత్వం ఆ స్థాయిలో అప్రమత్తం కావడం లేదు.



కిడ్నీ పనితీరుపైనే మన ఆరోగ్యం

కిడ్నీలు ఒంట్లోని వ్యర్థాలు, అదనపు నీటిని బయటకు పంపిస్తాయి. రక్తాన్ని శుద్ధి చేస్తాయి. హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కావల్సిన హార్మోన్ కిడ్నీ నుంచే వస్తుంది. విటమిన్– డీ చివరి రూపం కూడా కిడ్నీలోనే ఏర్పడుతుంది. తద్వారా ఎముకల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. శరీరంలో నీటి స్థాయిని కంట్రోల్ చేయడానికి ఉపయోగపడుతుంది. గుండె తర్వాత బ్లడ్ ప్రెజర్‌ని కంట్రోల్ చేయడంలో కీలక పాత్ర వహిస్తుంది.

ఆ మూడు పరీక్షలు చాలు

క్రియాటినిన్, అల్ట్రా సౌండ్, యూరిన్ టెస్ట్ అనేవి కిడ్నీ ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి చేసే సాధారణ పరీక్షలు. కిడ్నీ ఆరోగ్యంగా ఉందా? లేదా? అనేది తెలుసుకోవడానికి క్రియాటినిన్ చేస్తారు. కిడ్నీలు పరిణామం తెలుసుకోవడానికి ఆల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తారు. కిడ్నీ పనితీరు ఎలా ఉందో తెలుసుకోవడానికి మూత్ర పరీక్షలు చేస్తారు. కొందరికీ మూడు పరీక్షలు అవసరం అవుతాయి. కొందరికి వీటిలో ఏదొక పరీక్షలో సమస్య బయటపడుతుంది.

ఆరోగ్యంగా ఉండాలంటే...

ఉప్పు ఎంత తగ్గిస్తే అంత మేలు. జంక్ ఫుడ్, కొవ్వులు ఎక్కువగా ఉండే నూనె పదార్థాలకు దూరంగా ఉండాలి. శరీరం బరువు పెరగకుండా కంట్రోల్‌లో ఉంచుకోవాలి. రోజుకి సరిపడా నీళ్లు తాగాలి. కూరగాయలు, ఆకు కూరలు తినాలి. డయాబెటిస్, బీపీ సమస్యలతో బాధపడుతున్న వారు రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవాలి. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా పెయిన్ కిల్లర్ వంటి మందులు రెగ్యులర్‌గా వాడకూడదు. అనారోగ్యంగా ఉన్నట్లు అనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.


"ముందస్తు లక్షణాలు లేకుండానే...



కాళ్ల వాపులు, నిరంతర అలసట చిన్న సమస్యలుగా కన్పిస్తాయి. అవి తీవ్రమైతే దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి ఉన్నట్టు బయటపడుతుంది. వేగంగా విస్తరిస్తున్న ఆరోగ్య సమస్యల్లో ఇదొకటి. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు కూడా సీకేడీ పెరుగుదలకు కారణమవుతున్నాయి.

– డాక్టర్ రంగనాథరావు, నెఫ్రాలజిస్టు

"పరీక్షలు చేయించుకోవాలి..



సీకేడీ ప్రారంభ దశలో లక్షణాలు కన్పించవు. ఎప్పటికప్పుడు స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలి. సీరం క్రియాటినిన్, మూత్రంలో ప్రొటీన్ పరీక్ష, రక్తపోటు నియంత్రణ వంటి సాధారణ పరీక్షలు కిడ్నీల ఆరోగ్యాన్ని ముందుగా తెలుసుకోవచ్చు.నీరు తాగడం, మధుమేహాన్ని అదుపులో ఉంచడం, పెయిన్ కిల్లర్స్ అధిక వినియోగం తగ్గించడం, కిడ్నీ పరీక్షలు చేయించుకోవడంతోనే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు.

–డాక్టర్ కె.విద్యాసాగర్, నెఫ్రాలజిస్టు

స్వీయ అప్రమత్తత తప్పనిసరి

ఆరోగ్యంపై అవగాహన లేక చాలా మంది కిడ్నీ సమస్యను గుర్తించలేకపోతున్నారు. లక్షణాలు బయటపడే లోపే సమస్య ముదిరిపోతుంది. అందుకే కిడ్నీ రోగాన్ని సైలెంట్ కిల్లర్ అని పిలుస్తుంటారు. ఎవరికి కిడ్నీ సమస్యలు వస్తాయి?ఎవరు కిడ్నీ పరీక్షలు చేసుకోవాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? వంటి విషయాలపై అవగాహన ఉండాలి. ఈ అవగాహన కోసమే ఏటా మార్చి రెండో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది థీమ్ ' మీ కిడ్నీలు బాగానే ఉన్నాయా? వెంటనే పరీక్షించుకోండి. మీ కిడ్నీల ఆరోగ్యాన్ని రక్షించుకోండి' అంటూ చైతన్యం కల్పిస్తున్నారు.

ఎవరికి వస్తుందంటే..

కుటుంబంలో ఎవరికైనా కిడ్నీ సమస్య ఉంటే తర్వాతి తరాలకు వచ్చే ప్రమాదం ఉండొచ్చు. డయాబెటిస్, బీపీ, ఒబెసిటీ, గుండె జబ్బులు, కిడ్నీలో రాళ్లు ఉన్న వాళ్లు తప్పనిసరిగా కిడ్నీ టెస్ట్ చేసుకోవాలి. యూరిన్ ఇన్ఫెక్షన్‌లు తరుచూ వచ్చే వాళ్లకు, మందు, పొగ తాగే అలవాటు ఉన్న వాళ్లకు కిడ్నీ సమస్యలు వస్తుంటాయి. కిడ్నీ సమస్య నుంచి ఒకసారి బయటపడిన వారు తర్వాత దాని గురించి పట్టించుకోకపోవడం ప్రమాదకరం.

రెండు రకాల సమస్యలు

కిడ్నీ సమస్యలు రెండు రకాలు. ఒకటి తాత్కాలికంగా వచ్చేవి. వీటిలో కిడ్నీలు సడన్‌గా ఫెయిలవుతాయి. యూరిన్ ఇన్ఫెక్షన్లు, కిడ్నీలో రాళ్లు, గుండె జబ్బులు, నిమోనియా, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు వాడటం, స్కిన్ ఇన్ఫెక్షన్లు వల్ల తాత్కాలిక కిడ్నీ సమస్యలు వస్తాయి. సరైన సమయంలో టెస్టులు చేసి, ట్రీట్‌మెంట్ చేసుకుంటే తిరిగి కిడ్నీలు మామూలు స్థాయికి చేరుకుంటాయి. రెండోది దీర్ఘకాలికంగా ఉండే సమస్యలు. వీటిలో అసలు లక్షణాలే కనిపించవు. దీనికి సాధారణ కారణాలు డయాబెటిస్, బీపీ. వీళ్లలో అడ్వాన్స్ స్టేజీలో మాత్రమే కన్పిస్తాయి. సాధారణంగా ఏవైనా వ్యాధి కారకాలు శరీరంలోకి వస్తే వెంటనే రియాక్షన్ కన్పిస్తుంది. సంబంధిత లక్షణాలు బయటపడతాయి. కానీ, కిడ్నీల విషయంలో అలా జరగదు.లక్షణాలు కనబడకుండానే వ్యాధి ముదిరిపోతుంది. బయటపడే సమయానికి అడ్వాన్స్ స్టేజ్ వచ్చేస్తుంది.

రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయం

- వైఎస్సార్‌సీపీ కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు



బొడ్డేపల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కళింగ జాతి అభివృద్ధికి బొడ్డేపల్లి రాజగోపాలరావు చేసిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దుంపల లక్ష్మణరావు అన్నారు. బుధవారం బొడ్డేపల్లి రాజగోపాలరావు 102వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం పట్టణంలోని సింహద్వారం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి పదవి కావాలా.. ప్రాజెక్టు కావాలా అని అప్పట్లో ఆయనకు ఆఫర్ ఇస్తే ప్రాజెక్టు కావాలంటూ జిల్లా అభివృద్ధి కోరుకున్న మహనీయుడని కొనియాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ కళింగ జాతికి బీసీ–ఏ రిజర్వేషన్ కల్పించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన కృషి వలన నేడు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నామని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణించినా ప్రతీ ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొందూరు మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్, చింతాడ ప్రసాద్, పైడి నాగభూషణ్, సీపాన రామారావు, చాపర వెంకటరావు, పైడి శ్రీను, తిర్లంగి లోకనాథం, బొడ్డేపల్లి మోహన్, గురుగుబెల్లి శేఖర్, పప్పల సూర్యారావు, పొన్నాడ సత్యం, దుంపల గోవిందరావు, సీపాన హేమసుందర్, చింతాడ శ్రీను, మెట్ట రామారావు, బుడుమూరు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందిపై టీడీపీ నేత దాడి

అరసవల్లి: విద్యుత్ బిల్లు చెల్లించమని అడిగినందుకు సిబ్బందిపై పెద్దపాడుకు చెందిన టీడీపీ నేత దాడికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. డీ–2 బలగ సెక్షన్ పరిధిలోని పెద్దపాడు పరిసరాల్లో టీడీపీ నేత కలగ శ్రీనివాసరావుకు చెందిన నాలుగు విద్యుత్ సర్వీసులకు సంబంధించి, గత నవంబర్ నుంచి సుమారుగా రూ.15 వేల వరకు విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో డీ–లిస్టులో ఉన్న ఈ సర్వీసుల నిలుపుదల చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే ముందుగా వినియోగదారుడికి సమచారం ఇవ్వడానికి సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ వి.నారాయణరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లిబాబు, లైన్‌మెన్ ఎం.భాస్కరరావు, జేఎల్ఎంలు కె.చలపతిరావు, జి.హరికృష్ణల బృందం, తంగివానిపేట రోడ్డులో ఒక నిర్మాణం వద్దనున్న కలగ శ్రీనివాసరావును కలిసి పరిస్థితిని వివరించారు. దీంతో ఆయన ఆగ్రహించి సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ నారాయణరావుకు చెంపదెబ్బ కొట్టాడని సిబ్బంది పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. దీనిపై విద్యుత్ సిబ్బంది స్పందించి కలగ శ్రీనివాసరావుపై పోలీసులు చర్యలు తీసుకోకపోతే నిరసనకు దిగుతామని హెచ్చరించారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

నందిగాం: మండలంలోని సుభద్రాపురం గ్రామానికి చెందిన టొంపు తులసమ్మ(50) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తులసమ్మ భర్త 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. వాళ్లకు ఒక కుమార్తె పార్వతి ఉంది. పార్వతికి వివాహం చేయగా, ఒక కుమారుడు పుట్టాక భర్త ఆమెను విడిచిపెట్టడంతో తల్లి వద్దనే ఉంటోంది. దీంతో తల్లీకూతుళ్లు ఇద్దరూ కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తుండేవారు. అయితే తులసమ్మ ఇటీవల మతి స్థితిమితం కోల్పోయి ప్రవర్తించేది. కుమార్తె కూలీ పనికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న తులసమ్మ వాటర్ ప్యాకెట్ అనుకొని పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకొని అనంతరం మృతి చెందింది. పడిపోయి ఉన్న తులసమ్మను చూసినవారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మనువడు కుజ్జ జానకిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రణస్థలంలో...

రణస్థలం: మండలంలోని సంచాం గ్రామానికి చెందిన పప్పల రమణ(35) పురుగుల మందు తాగి మృతి చెందినట్లు జేఆర్‌పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు. పొలంలో షెడ్ వేసే విషయంలో ఇంట్లో తల్లి, భార్యతో గొడవపడి మనస్థాపానికి గురై బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. భార్య వెంటనే గమనించి రణస్థలం సీహెచ్‌సీకి తీసుకెళ్లింది. అక్కడ నుంచి వైద్యులు మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేయగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య పప్పల పెంటమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



పాతపట్నం: రికార్డులు పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

పాతపట్నం: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని రేషన్ డిపోలు, మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు(ఎండీయూఎస్), బూరగాంలోని రేషన్ షాపు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పాతపట్నం ఆల్ ఆంధ్ర రోడ్డులోని ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పెట్టే భోజనం సరిగా లేకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులు సక్రమంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, సీడీపీవో టి.విమలారాణి, ఏఎస్‌డబ్ల్యూవో ఎం.శ్యామల, ఎస్ఎస్ఏ జీసీడీవో ఎస్.నీరజ, ఎంఈవో–2 సీహెచ్ తిరుమలరావు, సీఎస్‌డీటీలు ప్రసాదరావు, చక్రవర్తిలు, ఆర్ఐ బాబి, ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రైతు సూర్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనూరాధ, ఉషారాణి తదితరులు ఉన్నారు.

మెళియాపుట్టి: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ కమిటీ సభ్యుడు బి.కాంతారావు సూచించారు. మండలంలోని కేజీబీవీ, చాపర ఎస్సీ హాస్టల్, ఎఫ్‌సీఐ గోడౌన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చాపర ఎస్సీ వసతి గృహంలో రికార్డులు, నిల్వ ఉన్న సామగ్రిలో తేడాలున్నట్లు గుర్తించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి, వార్డెన్‌కు మెమో జారీ చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు తహసీల్దార్ పాపారావు తదితరులు ఉన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



ఇచ్ఛాపురం టౌన్: పోలీసుల అదుపులో నిందితులు



నరసన్నపేట: వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుబలై గ్రామానికి చెందిన తుఫాన్ కరియా అనే వ్యక్తిని నరసన్నపేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 24 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. తుఫాన్ కరియా ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో రితీష్ అనే వ్యక్తికి ఇచ్చేందుకు తీసుకెళ్తున్నాడు. దీనికి సంబంధించి ముందస్తు సమాచారంతో మడపాం టోల్‌గేట్ వద్ద నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో తుఫాన్ కరియా ఒక వాహనంలో నుంచి దిగిపారిపోతుండగా వెంబడించి పట్టుకొని కేసు నమోదు చేశారు. బరంపురం నుంచి ఈ గంజాయిని తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

ఇచ్ఛాపురం టౌన్: ఒడిశా నుంచి సూరత్‌కు 10.31 కిలోల గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం ముమిదిహ గ్రామానికి చెందిన బురగాన సింహాచల పాత్రో, సంజయ బెహరాలను అరెస్ట్ చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. వీరిద్దరూ సూరత్‌లో పనిచేస్తూ జీవిస్తున్నారు. వారికి అక్కడ గంజాయి వ్యాపారం చేసే గొల్ల అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతను తనకు గంజాయి అందిస్తే కిలోకు రూ.9 వేలు ఇస్తానని చెప్పడంతో ఒడిశా రాష్ట్రంలోని కొద్ద గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద కొనుగోలు చేశారు. గంజాయిని ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్తుండగా పట్టణ పోలీసులు తనిఖీలు చేసి పట్టుకున్నారు. సమావేశంలో సీఐ చిన్నమనాయుడు, ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్ ఎప్పుడు పూర్తి చేస్తారు

- నిధులు కేటాయించకపోతే పోరాటం తప్పదు
- సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

నందిగాం: ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యుడు కె.మోహనరావులు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రల్లో భాగంగా బుధవారం నందిగాంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నంబూరు షణ్ముఖరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు 2007లో ప్రారంభించారని, నేటికి 18 ఏళ్లు గడుస్తున్నా సగం పనులు కూడా పూర్తవ్వకపోవడం దారుణమన్నారు. ఇది శ్రీకాకుళం జిల్లాపై పాలకులకు ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రారంభంలో రూ.127 కోట్లు అంచనా వ్యయం కాగా, ప్రస్తుతం అది రూ.852 కోట్లకు పెరిగిందని గుర్తు చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో రిజర్వాయర్‌కు తగిన నిధులు ఎందుకు కేటాయించలేదో మంత్రి అచ్చెన్నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్‌లో మొక్కుబడి కేటాయింపులు పాత పనుల బిల్లులకే సరిపోతాయని ఎద్దేవా చేశారు. రిజర్వాయర్ పూర్తి చేయాలనే చిత్తశుద్ధి ఉంటే రూ.500 కోట్లు కేటాయించాలన్నారు. ఆఫ్‌షోర్ పూర్తయితే 24,600 ఎకరాలకు సాగునీటితో పాటు పలాసకు తాగునీరు అందుతుందని తెలిపారు. పెండింగ్ పనులకు నిధులు కేటాయించకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. అలాగే జిల్లాలో గిరిజన ప్రాంతాన్ని ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని, ఐటీడీఏను ఏర్పాటు చేయాలని, రైతులు పండించిన పంట మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు పాలిన సాంబమూర్తి, హనుమంతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇచ్చి దారి దోపిడి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కోసంగిపురం జాతీయ రహదారి కూడలి వద్ద మంగళవారం సాయంత్రం దారి దోపిడి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. పలాస కిడ్నీ ఆస్పత్రిలో దుంపల అప్పన్న వైద్య సేవలు పొందుతున్నాడు. అతడిని చూసేందుకు భార్య యశోద వచ్చింది. ఆయనకు ఆహారం అన్నీ సమకూర్చి ఇంటికి బయల్దేరగా గుర్తు తెలియని వ్యక్తి స్కూటీపై వచ్చి లిఫ్ట్ ఇచ్చాడు. కోసంగిపురం శివాలయం పక్కన నిర్మానుష్య తోటలు వచ్చేసరికి, తోటలోకి ఆమెను తీసుకెళ్లి కత్తితో భయపెట్టి బంగారు పుస్తెల తాడు (రెండున్నర తులాలు) దోచుకున్నాడు. అనంతరం దుండగుడు అక్కడ నుంచి పారిపోయాడు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.